హాఫ్ మారథాన్ గోడ పత్రిక ఆవిష్కరణ

హాఫ్ మారథాన్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట జూన్ 17 : ప్రస్తుత సమాజంలో ఒత్తిడితో కూడిన ఉరుకుల పరుగుల మానవ జీవితంలో శారీరక, మానసిక వికాసానికి నడక, రన్నింగ్, వ్యాయామం ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఆయన సిద్దిపేట రెండో ఎడిషన్ హాఫ్ మారథాన్ గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయం అర గంట నుంచి గంటపాటు శారీరక శ్రమ చేయాలని సూచించారు. జూలై 28న సిద్దిపేటలో జరిగే రెండో ఎడిషన్ హాఫ్ మారతాన్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. https : // shm24. iq30 1.com లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి అన్నారు. కత్తుల బాపురెడ్డి, పరంధాములు, రాజు, వెంకట్, హరి, నర్సింహులు, రమేశ్ పాల్గొన్నారు.

చిన్నషిర్డీ క్షేత్రంలో ఘనంగా వేడుకలు

స్వామి వారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు

చేర్యాల, జూన్ 17 : మండలంలో పోతిరెడ్డిపల్లి గ్రామంలోని చిన్న షిర్డీ క్షేత్రంలో సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీభట్ల శంకర్ సిద్ధాంతి శర్మ, అనిల్‌శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ స్వామి వారి ఆలయంలో వేకువజామునే సుప్రభాత సేవ, స్వామి వారికి అలంకరణ, అభిషేకం, హారతి, స్వామి వారికి మహా నివేదన, మంత్ర పుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం క్షేత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమాల్లో ప్రొద్దుటూరి విట్టలయ్య, కత్తుల మాధవరెడ్డి, బట్టు మోహన్‌రెడ్డి, కత్తుల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎంపీకి ఆహ్వానం



ఎంపీ రఘునందన్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గౌడ సంఘం సభ్యులు

రాయపోల్, జూన్ 17 : రాయపోల్ మండల కేంద్రంలో జరుగతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు గౌడ సంఘం సభ్యులతో పాటు బీజేపీ నాయకులు సోమవారం ఆయన నివాసంలో కలిసి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. నాయకులు రవీందర్‌రెడ్డి. బీజేవైఎం మండల అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జి అందిపురం రాజుగౌడ్, మాజీ సర్పంచ్ స్వామి తదితరులు ఉన్నారు.



మిరుదొడ్డి : అల్వాలలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తొగుట : వెంకట్రావుపేటలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొమురవెల్లి : ఐనాపూర్‌లో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

దుబ్బాక ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

మద్దూరు ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లావ్యాప్తంగా సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నూతన బట్టలు ధరించి ముస్లింలు సమీపంలోని ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

-సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, జూన్ 17

వర్గల్ : గౌరారం ఈద్గావద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

చేర్యాలలో బక్రీద్ వేడుకలు

గౌరాయపల్లిలో కాలం చెల్లిన చిప్స్ ప్యాకెట్స్

కొమురవెల్లి, జూన్ 17 : మండలంలోని గౌరాయపల్లిలో నాలుగు నెలల క్రితమే కాలం చెల్లిన చిప్స్(కూర్కురే) సోమవారం ప్యాకెట్లు వెలుగులోకి వచ్చాయి. కాగా చాలా రోజులుగా గ్రామంలో కాలం చెల్లిన చిప్స్ (కూర్కురే) ప్యాకెట్లను అమ్ముతూ వ్యాపారులు చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి, ఇలాంటి కాలం చెల్లిన తినుబండారాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళ తప్పింది..

నాడు మర్రిచెట్టు

నేడు తొలిగించిన మర్రిచెట్టు

కొమురవెల్లి, జూన్ 17 : ఆ ఊరికి ఆచెట్టు పేరే నామకారణం. ఆ ఊర్లో ఏమైనా సమావేశం ఉంటే ఆ మర్రిచెట్టు వద్దే ఏర్పాటు చేసుకుంటారు. వివరాలకు వెళితే.. కొమురవెల్లి మండలంలోని మర్రిముచ్చాలలో చాలా సంవత్సరాల నుంచి మర్రిచెట్టు ఉన్నది. అటువంటి మర్రిచెట్టు గ్రామానికి ల్యాండ్ మార్క్‌గా ఉండేది. సిద్దిపేట-సూర్యాపేట జాతీయ రోడ్డు విస్తరణ కార్యక్రమంలో సోమవారం మర్రిచెట్టును తొలిగించడంతో ఊరంతా చిన్నబోయింది. ఎన్నో ఏండ్లుగా రహదారి పక్కన బాటసారులకు నీడనిచ్చే మర్రిచెట్టు తొలిగింపుతో ఊరు కళ తప్పింది.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నేతలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేత శ్రీశైలం

జగదేవ్‌పూర్ జూన్ 17 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సోమవారం మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీశైలం, నేతలు ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చేర్యాల, జూన్17: చేర్యాల మండలంలోని ఆకునూరు రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రేణుకాఎల్లమ్మ విగ్రహం మెడలోని అర తులం బంగారు పుస్తెతో పాటు ఆలయంలోని హుండీని పగులకొట్టి నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. గౌడ సంఘం పెద్దలు సోమవారం చేర్యాల పోలీసులను ఆశ్రయించారు.

నిరాశ్రయులకు చేయూత

వృద్ధులకు దుస్తువులను అందజేస్తున్న దాతలు

సిద్దిపేట టౌన్, జూన్ 17 : సిద్దిపేట వనిత క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో పేద వృద్ధులకు ఉమదేవి, శ్రీకాంత్, గాయత్రి అరవింద్, సంధ్య, వినయ్ సహకారంతో దుస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హయాన్స్, వీరేశం తదితరులు ఉన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

రామోజీరావుకు నివాళులర్పిస్తున్న న్యూస్‌పేపర్ డిస్ట్రిబ్యూటర్స్

సిద్దిపేట టౌన్, జూన్ 17 : ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావుకు సిద్దిపేట న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశం, సెక్రటరీ శ్రీశైలం,రమేశ్ గౌడ్, భాస్కర్‌గౌడ్, లక్ష్మణ్ ఉన్నారు.

సామాజిక సమరత వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నరేశ్ బాబు

డాక్టర్ నరేశ్ బాబు

గజ్వేల్, జూన్ 17 : సామాజిక సమరత వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ ఆకుల నరేశ్ బాబును నియమించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సమావేశంలో గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ఆకుల నరేశ్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ గురుతర బాధ్యతలు అప్పగించినందుకు సామాజిక సమరత వేదిక అఖిల భారత కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్, రాష్ట్రకన్వీనర్ ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

31వ వర్ధంతి | గౌరవ స్మృత్యంజలి

కీ॥శే॥ మణికొండ భూపతిరావు గారు
గ్రా॥ ప్రజ్ఞాపూర్, మం॥ గజ్వేల్, జి॥ సిద్దిపేట, తెలంగాణ రాష్ట్రం.
జననం: 03-10-1914, మరణం: 18-06-1993

BHOOPATHI - CHANDRA MEMORIAL TRUST (BCMT) Pragnapur
Mandal: Gajwel, Dist: Siddipet, Telangana State, India.

తేది: 18-06-2024

మెరిండ్ల శ్రీనివాస్ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న రమణ

ఆర్థిక సాయం అందజేత

చేర్యాల, జూన్ 17 : చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం(కేజీకేఎస్) సిద్దిపేట జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి మెరిండ్ల శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మృతుడి కుటుంబాన్ని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏంవీ రమణ పరామర్శించి, మృతుడి కుటుంబ సభ్యులకు కేజీకేఎస్ తరుపున రూ. లక్ష యాభై వేల చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వేంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కోహెడ కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి, సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో పాల్గొన్నారు.

మద్దూరులో..

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 17 : మద్దూరు మండలంలోని సలాఖపూర్ గ్రామానికి చెందిన కామిడి నర్సింహారెడ్డి ఇటీవల మృతి చెందడంతో మృతుడి కుటుంబానికి సోమవారం గ్రామానికి చెందిన శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హైవే పనులు వేగవంతం చేయాలి

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ పట్టణంలో మార్నింగ్ వాక్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 17: హుస్నాబాద్‌లో జరుగుతున్న హైవే నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం పట్టణంలోని పలు వీధుల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని సందర్శించి రోజుకు ఎన్ని పాలు వస్తాయో, రైతులకు వచ్చే ఆదాయం ఏమిటో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైవే నిర్మాణం సందర్భంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల యజమానులు కొంత నష్టపోతున్నప్పటికీ హైవే నిర్మాణం జరిగితే అందరికీ మంచి జరుగుతుందన్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున డ్రైనే జీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలో ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. మంత్రి వెంట నాయకులు ఉన్నారు.

జాబ్ మేళాను విజయవంతం చేయాలి

హుస్నాబాద్, జూన్ 17 : పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో జరుగబోయే జాబ్ మేళాకు అధిక సంఖ్యలో నిరుద్యోగులను తరలించి ఎక్కువ మందికి ఉపాధి కలిగేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నెహ్రూ యువకేంద్ర కో-ఆర్డినేటర్‌గా పనిచేసి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచిన రామారావు సేవలు మరువలేనివని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లోని స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రామారావు సంతాపసభలో ఆయన మాట్లాడారు. స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, నాయకులు మోహన్‌రెడ్డి, మహేందర్, గౌరిశెట్టి వీరేశం, నోముల చంద్రారెడ్డి, అంజయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ములుగు, జూన్ 17 : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువతికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని వంటిమామిడిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని నేరెడ్‌మెట్‌కు చెంది న ప్రకాశ్ ప్రణీత్ కుమార్ (30) స్నేహితురాలు అక్షతో కలిసి సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో వంటిమామిడి వద్ద రాజీవ్‌రహదారిపై వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టడంతో ప్రకాశ్ అక్కడిక్కడే మృతిచెందాడు. అక్షయకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

రామునిబండ రామాలయంలో పూజలు చేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్ జూన్ 17 : మండలంలోని జంగంరెడ్డి పల్లె రాముని బండ రామాలయం బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం రామునిబండ రామాలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు కొండపోచమ్మ మాజీ చైర్మన్ హనుమంతారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మునిగడప ఎంపీటీసీ కిరణ్, నాయకులు మల్లేశం, గణేశ్, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

అందరి క్షేమం కోసమే చాలీసా పారాయణం

హుస్నాబాద్‌లోని పాటిమీద హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 17 : అందరి క్షేమం కోసమే హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నామని ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత అన్నారు. హుస్నాబాద్‌కు చెందిన మహిళలు 21వ రోజుల పాటు నిర్వహిస్తున్న హనుమాన్‌చాలీసా పారాయణం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పాటిమీద హ ను మాన్ ఆలయంలో చందనపూజ, ఆకుపూజ, వడపూజ, పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు, ఐదుమార్లు హనుమాన్ చాలీసాను పారాయాణం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, నూకల కైలాసం, లక్కిరెడ్డి తిరుమల, మాశెట్టి రాణి, నార్ల విజయలక్ష్మి, నీరుమల్ల రాణి, లావణ్య, రజని, తాడ మాధవి, సంధ్యతో పాటు పలువురు హాజరయ్యారు.

ఆరుద్ర ఆగమనం

మద్దూరులో కనవిందు చేస్తున్న ఆరుద్రపురుగులు

మద్దూరు(ధూళిమిట్ట),జూన్ 17: ఆరుద్ర కార్తె ఆగమనానికి గుర్తుగా కనిపించే ఈ ఎర్రటి పురుగులు ఆరుద్ర కార్తెకు ముందే కనిపిస్తుండడం శుభసూచకంగా రైతులు భావిస్తున్నారు. ఈ నెల 22న ఆరుద్ర కార్తె ప్రారంభం అవుతున్నప్పటికీ ఆరుద్ర పురుగులుగా పిలువబడే ఈ ఎర్రటి పురుగులు మృగశిర కార్తెలోనే రైతుల పొలాలల్లో కనువిందు చేస్తున్నాయి. ఎర్ర పట్టు వస్త్రం కప్పుకున్నట్లు మెరిసిపోయే విధంగా కనిపించే ఈ అరుద్ర పురుగులను చూసి చిన్నారులు మురిసిపోతున్నారు. ఈ ఆరుద్ర పురుగులు కనిపిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామాల్లో రైతులు నమ్ముతుండడం విశేషం.

వర్షాల కోసం పూజలు

జగదేవ్‌పూర్/కొండపాక (కుకునూరుపల్లి) జూన్ 17 : వార్షాలు కురువాలని కోరుతూ సోమవారం మండలంలోని బీజి వెంకటాపూర్, కుకునూరుపల్లి మండల కేంద్రంలో చిన్నారులు కప్పతల్లికి పూజలు చేశారు. చిన్నారులను చూసి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.